ప్రజాశక్తి
శనివారం 22 ఏప్రిల్ 2023
5
విజయనగరం

వామపక్ష నాయకులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

2016లో వామపక్ష నాయకులపై పోలీసులు పెట్టిన కేసును జిల్లా కోర్టు శుక్రవారం కొట్టివేసింది. అధిక ధరలు తగ్గించాలని జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన సందర్భంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిష్టిబొమ్మను నాయకులు దగ్ధం చేశారు. దీంతో 9 మందిపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ పూర్తికాగా కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్వతీపురం మన్యంజిల్లా కార్యదర్శి రెడ్డివేణు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు చేస్తున్న తమపై పోలీసులు, ప్రభుత్వాలు ఎన్ని నిర్బంధాలు పెట్టినా ప్రజల కోసం నిరంతరం పోరాడుతామని అన్నారు. అప్పట్లో కేసు నమోదైన వారిలో రెడ్డివేణు, సిపిఎం నాయకులు పి.శంకర్రావు, కోలక అవినాష్, ఎన్‌వై నాయుడు, కోరాడ ఈశ్వరరావు, కొల్లి సాంబమూర్తి, మద్దిల రమణ, సిపిఐ నాయకులు టి.జీవ, పురం అప్పారావు ఉన్నారు.

సిఎం సభాస్థలిని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

నిర్వాసితుల కాలనీల్లో

కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-భోగాపురం రూరల్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్వాసితుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలను కలెక్టర్ నాగలక్ష్మి శుక్రవారం సందర్శించారు. నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే వాటిని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ముందుగా పోలిపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీని సందర్శించారు. కాలనీలో పర్యటించి, నిర్వాసితులు, స్థానిక గ్రామ పెద్దలతో మాట్లాడారు. పోలిపల్లి నిర్వాసిత కాలనీని పంచాయతీగా ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని, పోలిపల్లి జంక్షన్‌ను అభివృద్ధి చేసి ఆర్చ్‌ను ఏర్పాటు చేయాలని, అప్రోచ్ రోడ్డుకు కాలనీ రోడ్లను అనుసంధానించాలని గ్రామ పెద్దలు కోరారు. పంచాయితీగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. యువతకు ఉద్యోగాలతోపాటు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం గూడెపు వలస నిర్వాసిత కాలనీలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనాలను పరిశీలించారు. ఈ భవనాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ముఖ్యమంత్రి సభాస్థలి పరిశీలన

ముఖ్యమంత్రి సభాస్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

మే 3న భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో, బహిరంగ సభను నిర్వహించే ప్రాంతాన్ని కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్ పరిశీలించారు. సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, అప్రోచ్ రోడ్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు, విఐపిలకు, అతిధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పర్యటనలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రాజా, ట్రాన్స్‌కో ఎస్ఇ నాగేశ్వర్రావు, పిఆర్ ఎస్ఇ గుప్త, ఆర్ అండ్‌బి ఎస్ఇ జయశ్రీ, ఇఇ రమణ, తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపిడిఒ బంగారయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆసరాపై ఆందోళన వద్దు

- అర్హులందరికీ నగదు బదిలీ
- ప్రజాశక్తి కథనంపై డిఆర్‌డిఎ పీడీ స్పందన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఆసరా పథకంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. బ్యాంకు ఖాతాల్లో నగదు పడడం కొంత వరకు ఆలస్యం కావడం వాస్తవమేనని అన్నారు. 'అందని ఆసరా' అనే శీర్షికతో శుక్రవారం ప్రజాశక్తిలో కథనం వెలువడిన విషయం విధితమే. దీనిపై పీడీ స్పందించారు. జిల్లా వ్యాప్తంగా మూడో విడత ఆసరా పథకం కింద 36,463 స్వయం సహాయ సంఘాలకు రూ.251.30కోట్ల మేర అందజేయాల్సి వుండగా ఇప్పటి వరకు సుమారు రూ.175కోట్ల మేర అందిందని తెలిపారు. మిగతా రూ.76.3 కోట్లు త్వరలోనే సంబంధింత బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఎక్కువగానే చెల్లింపులు జరిగాయని, ఆ తరువాత పలు కారణాల వల్ల ఆలస్యమైందని తెలిపారు. త్వరలోనే వాటిని కూడా ప్రభుత్వం సర్దుబాటు చేస్తుందని తెలిపారు. పట్టణ కేంద్రాల్లోని సంఘాలకు దాదాపు నగదు జమ అయిందని పేర్కొన్నారు. కొన్ని అనర్హతగల సంఘాలు కూడా ఉన్నాయని, వాటికి సంబంధించి రూ.7 లక్షల వరకు నగదు చెల్లింపు నిలిపివేయ బడుతుందని వివరించారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం : పోక్సో కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.16వేలుజరిమానా విధిస్తూ పోక్సో న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించిందని ఎస్‌పి ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. గంట్యాడ మండలం కొర్లాం గ్రామానికి చెందిన కారు చిన్నారావు (33) బాలికను ట్యూషను పేరుతో మోసం చేసి, లైంగిక నేరానికి పాల్పడడంతో దిశ మహిళా పోలీసు స్టేషనులో 2021 సెప్టెంబర్ 21న దిశ మహిళా పోలీసు స్టేషనులో పోక్సో కేసు నమోదైందని తెలిపారు. అప్పటి దిశ స్టేషన్ డిఎస్‌పి త్రినాధ్ దర్యాప్తు చేసి నిందితుడిపై న్యాయ స్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. నిందితుడిపై నేరం నిరూపణ కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా, బాధితురాలికి రూ. 5లక్షలు పరిహారాన్ని న్యాయమూర్తి మంజూరు చేసారన్నారు.

మోడీది రాక్షస పాలన

ప్రచారభేరిలో వామపక్ష నాయకులు

ప్రచారభేరిలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కె.సురేష్

ప్రజాశక్తి-రాజాం

మోడీ రాక్షస పాలన నుంచి దేశాన్ని కాపాడాలని సిపిఎం, సిపిఐ నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రచారభేరిలో భాగంగా రాజాం, సంతకవిటీ మండలాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. రాజాం అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద ప్రచారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.సురేష్, సిపిఐ నాయకులు ఎన్.నాగభూషణం మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో దేశాన్ని అధోగతి పాల్జేసిందని, సంపదను ఆదాని, అంబానీలకు అమ్మేస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని అన్నారు. దేశంలో బిజెపిని గద్దె దించకపోతే ప్రజాస్వామ్యం పెద్ద ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గమైన పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటంలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కనకరాజు, సిపిఎం నాయకులు రామూర్తి నాయుడు, విశ్వనాథం, తిరుపతిరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణకై మోడీని గద్దె దించండి

విజయనగరం టౌన్ : మోడీని గద్దె దించండి .. దేశాన్ని కాపాడండి...అని ప్రజలకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం వామపక్షాల ప్రచార భేరి లంకాపట్నం, హుకుంపేట, శాంతినగర్, నాగవంసం వీధిలో నిర్వచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ బిజెపి ప్రభుత్వం పెట్టుబడి దారులకు కట్ట బెట్టిన ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం, ప్రజాతంత్ర హక్కుల కోసం వామపక్షాలు పోరాడుతున్నాయని అన్నారు. నాడు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి అనేక మంది త్యాగ ధనులు స్వాతంత్ర్యాన్ని సాధిస్తే నేడు మోడీ ఆ స్వాతంత్ర్యాన్ని విదేశీ కంపెనీలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. 75ఏళ్లుగా నిర్మించు కున్న ప్రభుత్వ రంగ సంస్థలను నేడు బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారం అమ్మేస్తోందన్నారు. ప్రజలు పెరుగుతున్న ధరలు భరించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్తున్నారని తెలిపారు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోగా ఉత్తరాంధ్ర జిల్లాలకు తల మానికంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ను అమ్మేస్తున్నారని అన్నారు. ఈ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, వి.రామచంద్రరావు, సిపిఐ నాయకులు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో పురోగతి సాధించాలి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని రకాల ప్రక్రియలను త్వరితగతిన ముగించాలని, పెండింగ్ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తోటపల్లి, తారకరామ తీర్థసాగర్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంగళరాయ సాగర్ తదితర ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లంపు తదితర అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సాగునీటి ప్రాజెక్టులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో ఇప్పటి వరకు జరిగిన పనులు, మిగిలిన పనులకు సంబంధించి ప్రత్యేక నివేదికలు తయారు చేయాలని పేర్కొన్నారు. తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్టు, తోటపల్లి ప్రాజెక్టు పరిధిలో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించి మరిన్ని ఫలితాలు సాధించాలని నిర్దేశించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తించే విషయమై రెవెన్యూ,

రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్

ఇరిగేషన్ శాఖల అధికారులు సంయుక్త క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శన్ దొర, పద్మలత, ఇరిగేషన్ ఎస్.ఈ. సుగుణాకర్ రావు, తోటపల్లి ఇఇ రామచంద్రరావు, వివిధ మండలాల తహశీల్దార్లు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్ స్టోరేజ్ పరిశీలన

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని భీమాలి పంచాయతీలో ఉన్న మామిడి తాండ్ర కోల్డ్ స్టోరేజ్‌ను ఉద్యానశాఖ రాష్ట్ర బృందం శుక్రవారం పరిశీలించింది. శ్రీపరదేశమ్మతల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు ఉద్యానశాఖ రాయితీతో నిర్మించుకున్న మామిడి తాండ్రి కోల్డ్ స్టోరేజ్ ఏడాది పొడవునా మామిడి తాండ్ర తయారీ రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఎడిహెచ్ రత్నాచారి అన్నారు. మామిడి తాండ్ర రైతులు ఎఫ్‌పిఒ ద్వారా ఆర్థిక లావాదేవీలు చేసుకుంటే ఆర్థికంగా బలపడతారని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి కె.శైలజ, భీమాలి సర్పంచ్ కోయాన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విజయవాడలోని పలువురు న్యాయవాదులకు సిఐడి నోటీసులు ఇవ్వటాన్ని ఖండిస్తూ శృంగవరపుకోట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడినందుకు సీనియర్ న్యాయవాదులకు సిఐడి నోటీసులు జారీ చేయడాన్ని వారు తప్పుబట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి డబ్ల్యుఎన్ శర్మ, సీనియర్ న్యాయవాదులు బి.త్రిమూర్తులు, వియ్యపు రమణ, టివిఆర్ మూర్తి, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు పాల్గొన్నారు.

సైబరు మోసాలపై ప్రత్యేక చర్యలు

కొత్తవలస సిఐ సూర్యారావుకు జ్ఞాపికను అందిస్తున్న ఎస్‌పి దీపిక

నేర సమీక్షలో ఎస్‌పి దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోసైబర్ నేరాలను ఛేదించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సైబరు నేరం జరిగిన తీరును బాధితుల నుండి తెలుసుకొని, వారు పోగొట్టుకున్న నగదును తిరిగి తెప్పించేందుకు, సంబంధిత బ్యాంకు అధికారుల సహకారంతో మోసాలకు పాల్పడిన నేరస్థులు ఆర్థిక లావాదేవీలు జరపకుండా వారి బ్యాంకు అకౌంటుల నిలుపుదల చేయాలన్నారు. సైబరు మోసాలకు పాల్పడిన నిందితుల ఫోను నంబర్లను సేకరించి, వారి చిరునామాలు, కాల్స్ తో కేసులను ఛేదించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ కేసుల్లో మత్తు పదార్థాలు, గంజాయి అక్రమ రవాణ చర్యలు చేపట్టాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి జిల్లాకు వచ్చి, లాడ్జిల్లో బస చేసిన వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత లాడ్జి యజమానులు తప్పనిసరిగా ఆయా పోలీసు స్టేషనులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని, నాన్ బెయిలబుల్ వారంట్లను తక్షణమే ఎగ్జిక్యూట్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

'బెస్ట్ ఫెర్ఫార్మర్'గా కొత్తవలస ఎస్ఐ బాల సూర్యారావు

విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చి, గత మాసంలో నమోదైన కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసినందుకు గాను, పోయిన ఆస్తులను రికవరీ చేసినందుకు కొత్తవలస ఎస్ఐ ఎస్.బాల సూర్యారావును 'బెస్ట్ ఫెర్ఫార్మర్' గా జిల్లా ఎస్పీ ఎం. దీపిక ఎంపిక చేసి, జ్ఞాపికను ప్రదానం చేసారు. వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తూ, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఎస్ఐబి అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్‌పి బి.మోహనరావు, దిశ మహిళా పిఎస్ డిఎస్‌పి ఎం. వెంకటేశ్వర్లు, డిటిసి డిఎస్‌పి వీరకుమార్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సోదర భావంతో మెలగాలి

ఇఫ్తార్ విందులో జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే పండుగే రంజాన్ అని.. దానిలోని అంతరార్థాన్ని అర్థం చేసుకొని అందరూ సోదరభావంతో మెలగాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ముస్లిం పెద్దలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సందేశం అందించారు. ముస్లిములకు అండగా ఉంటామని పేర్కొన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. ఆ దిశగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. మౌజాం, ఇమాంలకు గౌరవ వేతనం అందిస్తున్నామని గుర్తు చేశారు. ముస్లిములకు కలెక్టర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి లావణ్య, స్థానిక ముస్లిం పెద్దలు, వక్ఫ్ బోర్డ్ జిల్లా మాజీ అధ్యక్షులు ఎ. ఖరీం, జామియా మసీదు అధ్యక్షులు ఎస్. రహీమ్, ఎపిఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ ఎం.ఎస్.ఎస్. భాషా, కార్పొరేటర్లు సయ్యిద్ షకీల్, ఎస్. జాకీర్ హుస్సేన్, కో.ఆప్షన్ మెంబర్ షేక్ రహీమ్, తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ధర్నా

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పట్టణ పేదలు

విజయనగరం టౌన్ : బొగ్గుల దిబ్బ దళితులకు టిడ్కో ఇళ్లు అప్పగించాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 10 న విజయనగరం మున్సిపల్ అధికారులు అకారణంగా దళితుల ఇళ్లు కూల్చేశారని, రెండు నెలలైనా పునరావాసం కల్పించలేదని అన్నారు. ఇళ్లు లేని 25 మంది పేదలకు లంకాపట్నంలో ఇళ్లు ఇచ్చి పునరావాసం కల్పిస్తామని కలెక్టర్ చెప్పినా నేటివరకు కల్పించలేదన్నారు. వెంటనే టిడ్కో ఇళ్లు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు భరోసా

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సమాజంలో ఇతరులతో సమానంగా తాము లేమని అధైర్య పడకుండా, విభిన్న ప్రతిభా వంతులకు అండగా ప్రభుత్వాలు వున్నాయని భరోసా ఇచ్చేందుకు నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఉపకరణాల పంపిణీ గుర్తింపు శిబిరాలు దోహదం చేస్తాయని శాసనసభ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ, హైదరాబాద్‌కు చెందిన అలిమ్ కో కంపెనీ ఆధ్వర్యాన విజయనగరం నియోజకవర్గ స్థాయి ఉచిత ఉపకరణాల పంపిణీ గుర్తింపు శిబిరం శుక్రవారం కంటోన్మెంట్‌లోని నగరపాలక సంస్థ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగింది. శిబిరాన్ని ప్రారంభించి అక్కడికి వచ్చిన వికలాంగులతో కోలగట్ల మాట్లాడారు. వికలాంగ సంక్షేమశాఖ ద్వారా పదిమందికి బ్యాటరీతో కూడిన మూడు చక్రాల స్కూటర్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ గుర్తింపు శిబిరాలు నిర్వహించి అర్హులైన విభిన్నప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలు అందించనున్నాయని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే ఆరు నియోజకవర్గాల్లో ఈ శిబిరాలు పూర్తయ్యాయని వీటి ద్వారా 2027 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.2.70 కోట్ల విలువైన 3178 పరికరాలు, ఉపకరణాలు అందించేందుకు గుర్తించామని తెలిపారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తమ దైనందిన పనులను ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా పూర్తి చేసుకోవడానికి విభిన్న ప్రతిభా వంతులకు ఉపకరణాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నగర డిప్యూటీ మేయర్ రేవతి, విభిన్నప్రతిభావంతుల శాఖ ఎడి జగదీష్, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ. రాజ్‌కుమార్, తహశీల్దార్ బంగార్రాజు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు

పట్టణ సమస్యలపై వాడివేడిగా చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న రాంబార్కి శరత్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణ సమస్యలపై కౌన్సిల్ సమావేశంలో వాడివేడిగా చర్చ సాగింది. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో శుక్రవారం చైర్మన్ సావు మురళి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని కోరారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి విభాగంలో జరిగిన అవినీతిపై దర్యాప్తు నివేదిక బయట పెట్టాలని వైసిపి కౌన్సిలర్ పి.ఉమాశంకర్ కోరారు. సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలను పరిష్కరిస్తామని చైర్మన్ మురళి, కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. తాగునీటి విభాగంలో అవినీతి జరగలేదని మురళి వివరణ ఇచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పౌర సేవల దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం

అన్ని శాఖల ఉద్యోగులు సమిష్టిగా పని చేస్తూ, ప్రతిఒక్కరి పాత్రను రాజ్యాంగ బద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రజలకు సేవకులం అనే భావన ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లో 16వ జాతీయ పౌర సేవలు దినోత్సవానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, జెసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల సమిష్టి కృషి చెయ్యడం ద్వారా వత్తిడిని అధిగమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. గుర్తింపు కోసం పని చేయకూడదని, మంచి పని చేస్తే గుర్తింపు దానంతటదే వస్తుందని అన్నారు. ప్రజలకు సేవలు అందించగలం అనే నమ్మకాన్ని సాకారం చెయ్యడం కోసం ఎన్నో వత్తిడిలు, ప్రలోభాలను అధిగ మించాల్సి ఉంటుందని అన్నారు. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ మారుతున్న , సమకాలిక పరిస్థితులు అనుగుణంగా భాధ్యతలు చేపట్టాలని కోరారు. డిఆర్ఒ గణపతి రావు మాట్లాడుతూ ఈరోజు మనం సాధించుకున్న స్వేచ్ఛా స్వాతంత్రాలు పూర్వీకులు చేసిన త్యాగాల ఫలితమే అన్నారు. కార్యక్రమంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పలువురు సచివాలయ సిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, మెప్మా పీడీ సుధాకర్, డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, తదితరులు ప్రసంగించారు. పలు జిల్లా శాఖా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నగరాభివృద్ధిలో కోలగట్ల కృషి అభినందనీయం'

విజయనగరం టౌన్ : నగర అభివృద్ధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి అభినందనీయమని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు కొనియాడారు. శుక్రవారం నగరంలోని 46వ డివిజన్లో రూ.16.50 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డును కోలగట్ల ప్రారంభించారు. అనంతరం కాపు సామాజిక భవనాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయుడు బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వెనువెంటనే పరిష్కరించడంలో ఆయన చూపుతున్న చొరవ మరువలేనిదని అన్నారు. కామాక్షి నగర్ లో ఉన్న వెలమ సంక్షేమ భవనానికి రహదారి సౌకర్యం కల్పించాలని వెలమ సంఘం ప్రతినిధులు కోరిన వెంటనే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి రోడ్డు ఏర్పాటు చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నగరంలో అభివృద్ధి శరవేగంగా సాగుతుందన్నారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, స్థానిక కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో గడప గడపకూ.. నగరంలోని అవనాపు వీధి నుండి జరిగిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఆవనాపు లక్ష్మణరావు స్థానిక కార్పొరేటర్ నాగవల్లి, తవిటి రాజు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి,కనకల గిరి, కాళ్ళ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

ప్రజాశక్తి-గజపతినగరం

సమన్వయంతో పనిచేసి కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని అధ్యాపకులను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన గణనీయంగా తగ్గుతున్న విద్యార్థుల ప్రవేశ సంఖ్యను క్షుణ్ణంగా పరిశీలిస్తూ.. సబ్జెక్టుల వారీగా సమీక్ష చేశారు. అధ్యాపకుల పనితీరుపై కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, సుతిమెత్తగా మందలించారు. పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని, కళాశాల పురోగతికి పాటుపడాలని దిశానిర్దేశం చేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తుందని, దీన్ని సరి చేసుకోవాలని ,సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఎంపిపిలు బెల్లాన జ్ఞానదీపిక, సింహాద్రి అప్పలనాయుడు, పి. హైమావతి ,చల్లా చల్లంనాయుడు, జెడ్‌పిటిసిలు రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాశ్, ప్రిన్సిపల్ విజయ కుమారి పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో గ్రాడ్యుయేషన్ డే

చిన్నారులతో ఆర్ఐఒ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రింగ్‌రోడ్డులోని శ్రీచైతన్య టెక్నో స్కూలులో శుక్రవారం యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రీ ప్రైమరీ నుంచి ప్రైమరీకి ప్రమోట్ అవుతున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌డే నిర్వహిస్తామిని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి.జగదీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి దివీస్ విరాళం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో మహిళాశిశు ఆరోగ్య సేవలు అందించడంలో కీలకంగా ఉన్న నగరంలోని ఘోషాసుపత్రికి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి దివీస్ ఫార్మా పరిశ్రమ యాజమాన్యం రూ.5 లక్షలు విరాళంగా అందజేసింది. ఈ మేరకు చెక్కును జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్. అప్పల నాయుడులకు శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో జెడ్‌పి చైర్మన్ అందజేశారు. ఘోషాలో థియేటర్ కు వినియోగించే ఆకు పచ్చని క్లాత్ అవసరం ఉందని, పేషెంట్‌లపై కప్పడానికి, వైద్యుల గౌన్ల కోసం సుమారు వెయ్యి మీటర్ల అవసరం ఉందని ఘోషా హెచ్‌ఒడి డాక్టర్ అరుణ కుమారి ఇటీవల జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్‌ను కోరారు. దీంతో దివీస్ కంపెనీ వారితో మాట్లాడి సిఎస్ఆర్ కింద రూ.5 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

రెండు పూటలా పని చేయలేం
కార్యదర్శికి తేల్చిచెప్పిన కూలీలు

ప్రజాశక్తి- మెంటాడ

ఎండలు తీవ్రంగా ఉండటంతో రెండు పూటలా పనిచేయలేమని ఉపాధి హామీ కూలీలు మెంటాడ కార్యదర్శి రామనాథ్‌కు తేల్చిచెప్పారు. శుక్రవారం ఉపాధి హామీ పనుల పరిశీలనకు కార్యదర్శి వెళ్లారు. ఈ సందర్భంగా ఎండదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన కూలీలకు వివరించారు. కొలతల ప్రకారం రెండు పూటలా పనిచేస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. అనంతరం సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని సూచించారు. చెరువుల దూరంగా ఉండడం, రవాణా ఛార్జీలు ఇవ్వకపోవడంతో పనులకు వెళ్లే పరిస్థితి లేదని కూలీలు స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గౌరి నాయుడు పాల్గొన్నారు.

'అమ్మఒడి' అనర్హుల జాబితా పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వల్లంపూడి గ్రామంలో అమ్మఒడి పథకం అనర్హుల జాబితాను డిఎల్‌డిఒ నిర్మల సీతారాం పరిశీలించారు. 21 మంది విద్యార్థులకు అమ్మఒడి పథకం రావడం లేదని గ్రామస్తులు జెడ్‌పి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఇందువలన అమ్మఒడి అందని విద్యార్థుల జాబితాని డిఎల్‌డిఒ పరిశీలించారు. అమ్మఒడి మంజూరు కాకపోవడానికి కారణం ప్రధానంగా వెల్ఫేర్ అసిస్టెంట్ తప్పిదమేనని గుర్తించారు. కొన్ని సాంకేతిక కారణాలు కూడా ఉండడం వల్ల సరిచేసి, పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ బివికెఐవి పట్నాయక్, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సర్పంచ్ రుద్ర వెంకటరావు, కార్యదర్శి భాగ్యలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను నివారించాలని సిపిఎం, సిపిఐ నాయకులు బలసా శ్రీను, అలమండ ఆనందరావు అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక శివాలయం దగ్గర ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు దురాక్రమణ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే అధికార యంత్రాంగం పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూమిని పేదల ఇళ్ల నిర్మాణాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు.

మద్యం షాపు తరలించాలని వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి

పూల్‌బాగ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం షాపును దూరప్రాంతానికి తరలించాలని స్థానికులు.. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ యజమాని ప్రసాద్, విద్యా కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్ మాట్లాడుతూ పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న కళాశాల, మున్సిపల్ పాఠశాల, గీతామందిరం సమీపంలో మద్యం షాపు పెట్టడంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యాసంస్థలు, ఆలయాల వద్ద మద్యంషాపు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో పి.స్వామినాయుడు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మే 13న లోక్ అదాలత్

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక కోర్టులో మే 13న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంకు తగాదాలు, ప్రిలిటిగేషన్ కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. లోక్ అదాలత్ జయప్రదానికి న్యాయవాదులు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు, కక్షిదారులు సహకరించాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపిపి శంబంగి లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా క్రాష్‌ప్రోగ్రామ్‌ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల నుంచి నీటి సమస్యపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పిఎంకె రెడ్డి, ఎఇ శ్రావణ్, ఎంపిడిఒ ఎ.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

23న గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-వేపాడ

గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23న పరీక్ష నిర్వహిస్తున్నట్లు యు.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అరగంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

సచివాలయాన్ని సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి-వేపాడ

పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న డిపిఒ శ్రీధర్‌రాజు

మండలంలో వీలుపర్తి గ్రామ సచివాలయాన్ని శుక్రవారం డిపిఒ శ్రీధర్‌రాజు ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం గ్రామంలో వీధులను పరిశీలించి, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని సూచించారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగే విధంగా చూడాలని, డ్రైనేజీ బాగు చేయాలని పంచాయతీ కార్యదర్శి ఎం.అనూషకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి లీల, ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

97 మందికి వైద్య సేవలు

ప్రజాశక్తి-కొత్తవలస

రామలింగాపురం సచివాలయ పరిధిలోని బీడివలస, సుందరయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ చలుమూరు అప్పలనాయుడు, ఎంపిటిసి లెంక వరహాలు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. వైద్యాధికారి ఇ.గోపాలకృష్ణ 97 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. ఎంపిపి పాఠశాలను పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి తిరుపతిరావు, హెచ్‌ఎస్ రాము, గీతిక, ఎఎన్ఎం వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఈశ్వరరావు, ఆశా వర్కర్స్ అప్పన్నమ్మ, జ్యోతి, రాములమ్మ, తెలజ, పైలట్ గౌస్ పాల్గొన్నారు.

పిఎండిఎస్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని తుమ్మికాపల్లిగ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు పిఎండిఎస్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. డిపిఎం ఆనందరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరోది కొండలరావు, వివిఎ స్వప్న పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-బాడంగి

ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌బికె కార్యాలయంలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.చిరంజీవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ శరత్ చంద్ర, సిఆర్‌పి భారతి, అప్పలనాయుడు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మల్లంపేట గ్రామదేవత పండగ నేపథ్యంలో రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. మల్లంపేట, రామన్నదొరవలస రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేయాలన్నారు. కల్వర్టులపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పండగ మూడు రోజులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ ఉన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం పూసపాటిరేగ సమీపంలోని కారిపి వారి కళ్లాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి కూలీలతో ఆయన సమావేశమయ్యారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాధారణ ప్రజలు బతకలేని పరిస్థితికి నెట్టబడ్డారని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, కరెంటు ఛార్జీలు, నిత్యాసరాలు వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు.. ప్రభుత్వాలు విధిస్తున్న భారాలను మోయలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన చెందారు. మరోవైపు రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని, హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తున్న ప్రజలను మతం, కులం పేరుతో విభజన సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ దుర్మార్గపు విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం ప్రజలపై ఉందన్నారు.

బొబ్బిలి : వామపక్షాల ప్రచారభేరిలో భాగంగా పట్టణంలో జెండా మహల్ సెంటర్ నుంచి సిపిఎం, సిపిఐ ఆటో ప్రచారం చేపట్టాయి. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో దేశాన్ని అధోగతి పాలు చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు, నాయకులు ఎ.సురేష్, ఎస్.గోపాల్, కె.మణికుమార్, సిపిఐ జిల్లా నాయకులు ఎ.ఆనందరావు, కోట అప్పన్న, మునకాల శ్రీనివాసరావు అన్నారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటంలోకి రావాలని కోరారు.

బొబ్బిలిరూరల్ : బిజెపి పాలన నుండి దేశాన్ని కాపాడుకోవాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఆటో ప్రచారం నిర్వహించారు. జగన్నాథపురం, కలవరాయి, కోమటిపల్లి, చింతాడ, పక్కి, శివడవలస, పిరిడి, కారాడ గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల అధ్యక్షులు ఎస్.గోపాల్, ఎ.సురేష్, సిపిఐ మండల నాయకులు కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యాన ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపి, దేశాన్ని కాపాడుకుందామని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు మద్దిల రమణ, మద్ది కృష్ణ, కందిపల్లి భీముడు, అప్పారావు, నారాయణ, నరసింహారావు, అప్పలనాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పూసపాటిరేగ.. మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బి.సూర్యనారాయణ

బొబ్బిలి.. మాట్లాడుతున్న సిపిఎం నాయకులు పి.శంకరరావు

విశ్వవిద్యాలయాలే సమాజానికి పట్టుగొమ్మలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విశ్వవిద్యాలయాలు సమాజానికి పట్టుగొమ్మలని సెంచూరియన్ యూనివర్సిటీ విసి జిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం ఆ యూనివర్సిటీలో వివిధ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన విద్యా విధానం కంటే ముందు నుంచి నైపుణ్య శిక్షణకు సెంచూరియన్ యూనివర్సిటీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. భువనేశ్వర్ క్యాంపస్ నుంచి పాల్గొన్న అకాడమిక్స్ డీన్ డాక్టర్ పికె మహంతి మాట్లాడుతూ సెంచూరియన్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు విద్యను అందించడంతోపాటు సమాజాభివృద్ధికి ఏ విధంగా దోహదపడుతుందో వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పిఎస్‌వి రమణారావు, అడ్మిషన్ల డైరెక్టర్లు డాక్టర్ పల్లవి, సుకాంత్ తదితరులు ప్రసంగించారు. ప్రొఫెసర్ కెవిజి కృష్ణమూర్తి, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ డాక్టర్ సన్నీ డియోల్ పాల్గొన్నారు.



మెంటాడ.. గిరిజన గ్రామంలో పర్యటిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర ; కొత్తవలస.. సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

'గడపగడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-మెంటాడ

ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఆరోపించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు పాటుపడుతున్నారని చెప్పారు. శుక్రవారం మండలంలో లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని తోటవలస, కొండపర్తి, బాసరపాడు, కొండపర్తి బాడవ, సారాడవలస, జీరికవలస, ఎర్రవానివలస, ఉయ్యాడవలస గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా గ్రామస్తులు రాజన్నదొరకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులై ఉండి ఇంకా ఎవరికైనా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తెలియజేయాలని ఆయన కోరారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, వాటిని నమ్మొద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, లెంక రత్నాకర్ నాయుడు, వైస్ ఎంపిపిలు సారికి ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ ఆదిబాబు, గృహ నిర్మాణ శాఖ ఎఇ ప్రసన్నకుమార్, కనిమెరక త్రినాథ్, లోతుగెడ్డ సర్పంచ్ సారా భీమారావు, పి.అప్పలనాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, చొక్కాపు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కొత్తవలస : ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కొత్తవలస పంచాయతీ పరిధిలోని సాయినగర్, బొంతలవారి వీధి, రైల్వేకాలనీలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలు, గత ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాలు వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ మండల కన్వీనర్ బొంతుల వెంకటరావు, మేలాస్త్రి అప్పారావు, సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, గొరపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలోని పెదతాడివాడ సచివాలయ పరిధిలోని గుండాలపేట గ్రామంలో వైసిపి నాయకులు బుగత రమణ ఆధ్వర్యాన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత, ప్రస్తుత ప్రభుత్వాల మధ్య వ్యత్యాసం, ప్రతి కుటుంబానికీ అందుతున్న సంక్షేమ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, ఎమ్మెల్సీ జగన్నాథం, జెసిఎస్ మండల కన్వనర్ గౌరి, మాజీ వార్డ్ మెంబర్లు రామునాయుడు, రమణ, గురునాయుడు పాల్గొన్నారు.

డెంకాడ.. ప్రచార పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి వాసుదేవరావు

పేదల సొంతింటి కల నెరవేరింది

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వైసిపి హయాంలో పేదల సొంతింటి కల నెరవేరిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం పిరిడి గ్రామంలో జగనన్న లే అవుట్‌లో 19 ఇళ్ల శ్లాబ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఇంటి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, సర్పంచ్ తుట్ట వరలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ఎఇ దత్తి సింహాచలం, వైసిపి నాయకులు కొల్లి రామినాయుడు, కొల్లి రామకృష్ణ, గోర్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. రాజుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, ఎంపిపి శంబంగి లక్ష్మి, వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి సంకిలి శాంతకుమారి, బంటు త్రినాథరావు, బంటు అప్పలనాయుడు, ఎంపిటిసి మర్రాపు సీతారాం, చిన్నం నాయుడు, దిబ్బగుడి వలస సర్పంచ్ చింతల రామారావు, మండల జెసిఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదర్, మాజీ సర్పంచ్ అక్కేన గౌరమ్మ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



సిఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జామి

మండలంలోని కుద్దుపాలెం, చింతాడ గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కుద్దిపాలెం గ్రామానికి చెందిన జాన రాజేశ్వరి భర్త జాన కృష్ణ ప్రమాదవశాత్తూ మరణించారు. ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.3 లక్షలు మంజూరైంది. చింతాడ గ్రామానికి చెందిన యెర్ర లక్ష్మీ కుమారుడు యెర్ర సాయి ప్రమాదవశాత్తూ మరణిస్తే ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ.లక్ష మంజూరైంది. ఆ రెండు కుటుంబాలకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధితుల కుటుంబ పరిస్థితులను స్థానిక ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకు రావడంతో సిఎం సహాయనిధి మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, అలమండ సూరిబాబు రాజు, అలమండ దేవుడు, సర్పంచ్ పాపమ్మ, చింతాడ సర్పంచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గరివిడి

చీపురుపల్లిలోని రుంకానవీధిలో గురువారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమైన విషయం తెలిసిందే. శుక్రవారం బాధిత కుటుంబాలను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పరామర్శించారు. తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, రెడ్ క్రాస్ కిట్లు, గ్యాస్ కనక్షన్, సివిల్ సప్లై వారి ఆర్థిక సహాయం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వి.శిరీష, నాయకులు ఇప్పిలి అనంతం, వి.శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్ధన, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, మంగళగిరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ ఔదార్యం

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు ఎస్ఐ సన్యాసినాయుడు తన సొంత డబ్బులతో 100 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితులకు మానవతాదృక్పథంతో సాయానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

డాక్టర్ జనార్దనరావు అకాల మరణం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్త్రీ, శిశు వైద్యనిపుణులు పి.జనార్దనరావు శుక్రవారం తెల్లవారుజామున అకాల మరణం చెందారు. పట్టణానికి చెందిన జనార్దనరావు మూడు దశాబ్దాలుగా బొబ్బిలి, బలిజిపేట, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, సాలూరు, మక్కువ, సీతానగరం ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కొన్ని రోజులుగా జనార్దనరావు అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన మృతదేహాన్ని విశాఖ నుంచి బొబ్బిలి ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. జనార్దనరావు భౌతికకాయాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి బేబినాయన, రోటరీ క్లబ్ సభ్యులు టి.ఎన్.ఎస్ కార్తీక్, జెసి రాజు, గెంబలి శ్రీనివాసరావు, వి.శ్రీహరి, వైద్యులు, కౌన్సిలర్లు సందర్శించి నివాళులర్పించారు.

జనార్దనరావు (ఫైల్)

లారీని ఢీకొన్న స్కూటీ
ఇంజినీరింగ్ విద్యార్థి మృతి
ఇద్దరికి తీవ్ర గాయాలు

కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి రాము

ప్రజాశక్తి-డెంకాడ, పూసపాటిరేగ

ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొనడంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని నాతవలస టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

పూసపాటిరేగ మండల కేంద్రానికి చెందిన గురాన పవన్ (21), మరో ఇద్దరు స్నేహితులు డెంకాడ మండలం జొన్నాడ వద్దనున్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం పరీక్ష రాసేందుకు పూసపాటిరేగ నుంచి స్కూటీపై ముగ్గురు జాతీయ రహదారి మీదుగా వెళ్తున్నారు. నాతవలస సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి స్కూటీ ఢీకొంది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న పవన్ అక్కడికక్కడే మరణించాడు. వెనుక కూర్చున్న మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు 108 ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. పవన్‌కు తల్లిదండ్రులు గురాన రాము, లావణ్య, తమ్ముడు దీపక్ ఉన్నారు. రోడ్డు కుమారుడి మృతదేహం వద్ద తండ్రి రాము విలపించిన తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. సుందరపేట సిహెచ్‌సిలో పవన్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ యు.మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. శుక్రవారం రామతీర్థం గ్రామ సచివాలయ భవనం, కెఆర్ రోడ్ నుండి ఎటి అగ్రహారం వరకు నూతనంగా నిర్మించిన రోడ్డును ప్రారంభించారు. వల్లూరు గ్రామంలో సచివాలయం, ఆర్‌బికె భవనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్ కుమార్, ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్

అధికారులతో ఎంపిపి సమీక్ష

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీనివాసరావు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు శుక్రవారం సమీక్షించారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవదీసిన సమస్యలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు తెలిపారు. సచివాలయ ఉద్యోగు లకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిపి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రజలకు కావలసిన సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. విధులు చేపట్టి మూడేళ్లు గడిచినా ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏదైనా పనికి సంబంధించి అంచనా విలువ తెలియకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఇందుకు సంబంధించి వారికి వారానికి ఒక రోజు శిక్షణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఆర్.ఉమాదేవి, పిఆర్ ఎఇ వీరలక్ష్మి, హౌసింగ్ ఎఇ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీపై శిక్షణ

ప్రజాశక్తి-రామభద్రపురం

అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ కొల్లి ఈశ్వరరావు పాఠశాలల సామాజిక తనిఖీ అంశంపై మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో పాటు పాఠశాల అభివృద్ధి చెందాలంటే సంబంధిత ప్రధానోపాధ్యాయులు నాయకత్వం వహించాలని చెప్పారు. సమగ్ర పాఠశాల మూల్యాంకన విధానం, సామాజిక తనిఖీ, పర్యావరణ, సామాజిక వ్యవస్థల విధానాల అమలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయులను, విద్యార్థులను, తల్లిదండ్రులను సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పాఠశాలల్లో సామాజిక తనిఖీలంటే భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో ప్రభుత్వ బడుల పనితీరు గురించి అవగాహన పరిచేందుకు ఈ తనిఖీ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సామాజిక తనిఖీ ఈనెల 28 నాటికి 100 శాతం పూర్తి చేయాలని కోరారు. ఈ శిక్షణలో హైస్కూల్ హెచ్ఎంలు రావాడ భాస్కరరావు, ముట్నూరు వేణు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ సచివాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లో ఇంతవరకు చేపట్టిన పనుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అడిగిన వాటికి గ్రామాల వారీగా బడిలో పాఠాలు చదివినట్లుగా చదవడం, తప్పు చేసిన వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పి సమావేశం ముగించారు. ఉపాధి హామీ ద్వారా నాటిన మొక్కలు సగానికి పైగా రక్షణ లేక చనిపోయినట్లు క్షేత్ర సహాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిడిలు పి.జనార్దనరావు, శారదాదేవి, ఎఇ రమణమూర్తి, ఎస్ఆర్‌పి చిరంజీవి, ఎపిఒ సన్యాసినాయుడు, జె.రాజు, తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MEGISTRATE AT VIZIANAGARAM
I.A.NO: 391/2015 In O.S.No: 425/2012

Between:
Kapil Chit Funds Private Limited
Represented by its Asst. Manager,
Vizianagaram.
.... Plaintiff / Petitioner
And :
Tattikota Tirumala Rao & Others
.... Defendant / Respondent

NOTICE

To:
D1 : Tattikota Tirumala Rao,
S/o. Venkata Rao, Aged 29 years,
Tattikotavari Street, Salur,
Manyam District.

Please take Notice that the above named Plaintiff filed the above Suit against you, and the matter coming for your appearance and stands posted to 03-05-2023, on that day your personally or through advocate attend before the Honorable Court at about 10.30 AM filing which the Hon'ble court decided under the court of Law.
Vizianagaram.
Date : 21-04-2023
Sri. D. RAMA RAO,
Advocate,
Vizianagaram.